

జెడ్పీ సమావేశం నుంచి బయటకు వెళ్తున్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, జెడ్పీటీసీలు, ఎంపీపీలు


నమస్తే తెలంగాణ

మహబూబ్‌నగర్

నారాయణపేట

5 | మహబూబ్‌నగర్, శనివారం 15 జూన్ 2024 | MAHABUBNAGAR NARAYANPET


# గుంతలో ఇరుక్కున్న ఆర్టీసీ బస్సు

- జేసీబీ సాయంతో బయటకు లాగిన ప్రజలు

మల్దకల్, జూన్ 14 : మండలంలోని ఎల్కూర్–మల్లెందొడ్డి రహదారిపై ఉన్న గుంతలో ఆర్టీసీ బస్సు ఇరుక్కుపోయింది. స్థానికుల కథనం మేరకు.. గద్వాల నుంచి పాల్వాయి మీదుగా ఎల్కూర్, మల్లెందొడ్డి గ్రామాలకు ప్రతిరోజూ ఆర్టీసీ బస్సు వెళ్తుందన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు బీటీ రోడ్డుకు ఇరువైపులా గుంతలు ఏర్పడ్డాయి. దీనికి తోడు నిత్యం ఇసుక తరలించే వాహనాలతోపాటు ఇతర వాహనాలు తిరగడం వల్ల ఆ గుంతలు మరింత పెద్దవయ్యాయి. శుక్రవారం గద్వాల్ నుంచి మల్లెందొడ్డికి వెళ్తుండగా ఎదురుగా వాహనం రావడంతో డ్రైవర్ బస్సును రోడ్డు కిందకు దింపాడు. దీంతో ముందు టైరు మొత్తం గుంతలో ఇరుక్కుపోయింది. గమనించిన గ్రామస్తులు వెంటనే జేసీబీని తీసుకొచ్చి బస్సును రోడ్డు మీదకు లాగారు. ఆర్టీసీ అధికారులు మాట్లాడుతూ గుంతలను పూడ్చితేనే ఈ రూట్లో బస్సును నడుపుతామని చెప్పారు. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకొని రోడ్డుకు ఇరువైపులా ఉన్న గుంతలను పూడ్చి వేయాలని ప్రజలు కోరుతున్నారు.

# జెడ్పీ మీటింగ్ వాకౌట్..

- సమావేశం నుంచి వెనుదిరిగిన ఎమ్మెల్సీ, బీఆర్ఎస్ జెడ్పీటీసీలు
- మళ్లీ రప్పించిన ఎమ్మెల్యేలు యెన్నం, మధుసూదన్‌రెడ్డి
- సభ్యులను సన్మానించిన జెడ్పీ సీఈవో రాఘవేంద్రరావు

పాలమూరు, జూన్ 14 : పాలమూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణా సుధాకర్‌రెడ్డి అధ్యక్షతన శుక్రవారం నిర్వహించిన సర్వసభ్య సమావేశాన్ని బీఆర్ఎస్ జెడ్పీటీసీలు వాకౌట్ చేశారు. ఈ సందర్భంగా ముసాపేట జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్ మాట్లాడుతూ.. గతంలో ఎమ్మెల్యేగా పనిచేసిన స్వర్ణాసుధాకర్‌రెడ్డి అనుభవం, అంకితభావంతో పనిచేస్తారని ఆశించి జెడ్పీ చైర్‌పర్సన్ పదవికి ఆమోదం తెలిపామన్నారు. బీఆర్ఎస్ అధికారం కోల్పోయి కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొద్ది రోజుల్లోనే తమకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అధికార పార్టీలో చేరడం చాలా బాధకలిగించిందని ఆయన పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డితోపాటు జెడ్పీటీసీలందరూ సమావేశాన్ని వాకౌట్ చేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు. వెంటనే ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి జోక్యం చేసుకొని వాళ్లను మీటింగ్ హాల్‌కు రప్పించగా జెడ్పీ సీఈవో రాఘవేంద్రరావు శాలువాలతో సన్మానించారు. అనంతరం జెడ్పీ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మాజీ మంత్రులు నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి తనతో చాలా అభిమానంగా ఉండేవారని గుర్తు చేశారు. కొందరు మాత్రం తన పదవికి, తనకు ఎలాంటి గౌరవం ఇచ్చేవారు కాదని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై గౌరవంతో పనిచేశానని, తనపై ఎంతో నమ్మకంతోనే జెడ్పీ చైర్‌పర్సన్ పదవిని కట్టబెట్టినట్లు ఆమె వివరించారు. ఈక్రమంలో ఎన్నో అవమానాలు భరిస్తూ పార్టీ కోసం పనిచేశానన్నారు. గతంలో కేసీఆర్ ఆదేశాల మేరకు మక్తల్ అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నియోజకవర్గంలో పర్యటించి ప్రచారంలో పాల్గొని అభ్యర్థి విజయానికి కృషి చేశానని గుర్తు చేశారు. అలాంటిది ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో అక్కడ అభ్యర్థి ఓటమికి తానే కారణమని కొందరు తప్పుడు ప్రచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరోగ్య సమస్యలతో ప్రచారంలో పాల్గొనలేదని వివరించారు. చివరి సమావేశంలో ఇలాంటి ఘటన జరగడం చాలా బాధాకరమన్నారు. సమావేశంలో జెడ్పీ వైస్‌చైర్మన్ యాదయ్య, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# మూడు నెలలుగా వేతనాల్లేవ్..



వనపర్తి ప్రభుత్వ జనరల్ దవాఖాన ఎదుట ధర్నా చేస్తున్న పారిశుధ్య కార్మికులు

- ఇబ్బందులు పడుతున్న దవాఖాన పారిశుధ్య కార్మికులు
- అంబియన్స్ ఏజెన్సీ అరాచకాలపై కలెక్టర్ స్పందించాలి
- తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేశ్
- వనపర్తి ప్రభుత్వ దవాఖాన ఎదుట కార్మికులతో కలిసి ధర్నా

వనపర్తి, జూన్ 14 : మూడు నెలలుగా వేతనాలు లేక దవాఖాన పారిశుధ్య కార్మికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి సురేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం జిల్లాలోని జీజీహెచ్, ఎంసీహెచ్ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ ప్రభుత్వ జనరల్ దవాఖాన ఎదుట ఏఐటీయూసీ నాయకులు, కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ దవాఖానల్లో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు ప్రభుత్వం ప్రతి నెలా బడ్జెట్‌ను విడుదల చేస్తున్నా క్షేత్రస్థాయిలో అందించడంలేదని వాపోయారు. అంబియన్స్ ఏజెన్సీ అవినీతి అక్రమాలపై కొన్ని నెలలుగా విచారణ జరుగుతున్నదన్నారు. కార్మికులు పూర్తిస్థాయిలో వివరాలను అందజేస్తున్నా విచారణ పేరుతో మూడు నెలలుగా వేతనాలను పెండింగ్ ఉంచారన్నారు. ఈ సమస్యలను యూనియన్ నాయకులు, కార్మికులు అదనపు కలెక్టర్, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లినా ఏజెన్సీ నిర్వాహకులుల వేతనాలు చెల్లించకుండా మరిన్ని ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల వద్దకు దవాఖాన సూపరింటెండెంట్ రంగారావు, డీసీహెచ్ఎస్ చైతన్య గౌడ్, ఆర్ఎంవో ప్రభాకర్ వెళ్లి వేతనాలు త్వరలోనే అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు నాగరాజు, అఖిలపక్ష ఐక్యవేదిక అధ్యక్షుడు సతీశ్‌యాదవ్, యూనియన్ నాయకులు నర్సింహ, శ్రీను, దర్గాస్వామి, కుమార్, నరేందర్, మహేశ్, కృష్ణ, ఆనంద్, ఉదయ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ అరాచకం

- ఎమ్మెల్యే, కాంగ్రెస్ నేతలను నిలదీసిన బీజేపీ నేత
- సంగతి చూడమని హుకుం జారీ చేసిన ఎమ్మెల్యే
- నర్వ పీఎస్‌లో ఫిర్యాదు చేసిన కాంగ్రెస్ నేతలు
- ఎస్సై బెదిరింపులతో ఆత్మహత్య చేసుకున్న వైనం



శేఖర్‌రెడ్డి (ఫైల్)

మక్తల్, జూన్ 14 : అవినీతికి పాల్పడిన ఎస్సైని మండల కేంద్రానికి మళ్లీ ఎందుకు తీసుకొచ్చారని ప్రశ్నించినందుకు.. మక్తల్ ఎమ్మెల్యే, అతడి అనుచరుడు, కాంగ్రెస్ పార్టీ నర్వ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ చేసిన అరాచకాలకు తట్టుకోలేక బీజేపీ కార్యకర్త చంద్రశేఖర్‌రెడ్డి(39) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మక్తల్ నియోజకవర్గం నర్వలో చోటుచేసుకున్నది. వివరాలిలా.. గురువారం ఎమ్మెల్యే శ్రీహరి నర్వలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్మాణానికి స్థలాన్ని పరిశీలించేందుకు వెళ్లారు. ఆ సమయంలో పక్క పొలంలోనే ఉన్న నర్వకు చెందిన బీజేపీ కార్యకర్త మున్నూరు శేఖర్‌రెడ్డి ఇదే మండలంలో పనిచేసి వెళ్లిన ఎస్సై విక్రమ్‌ను మళ్లీ ఇక్కడికే తీసుకొచ్చేందుకు చూస్తున్నారని.. అవినీతి అధికారిని మళ్లీ ఎందుకు తీసుకొస్తారని ఎమ్మెల్యేని ప్రశ్నించాడు. దీంతో ఎమ్మెల్యే, అతడి ప్రధాన అనుచరుడైన నర్వ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ ఆగ్రహంతో ఊగిపోయారు. మా ప్రభుత్వం మా ఇష్టం.. అడగడానికి నువ్వెవరని శేఖర్‌రెడ్డిపై విరుచుకుపడ్డారు. అక్కడితో ఆగకుండా శేఖర్‌రెడ్డిపై చెన్నయ్యసాగర్ ఫిర్యాదు చేశాడు. ఎస్సై కుర్మయ్యతో శేఖర్‌రెడ్డిని బెదిరించి స్టేషన్‌కు వచ్చాక లాకప్ డెత్ చేస్తామని బెదిరించాడు. దీంతో భయభ్రాంతులకు గురైన శేఖర్‌రెడ్డి గురువారం రాత్రి పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లగా కుటుంబసభ్యులు గమనించి పాలమూరు ప్రభుత్వ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. గత అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ కార్యకర్త అయిన శేఖర్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీకి పనిచేస్తే.. ఎమ్మెల్యేగా గెలిచిన ఐదు నెలల్లోనే ఎమ్మెల్యే నియోజకవర్గంలో అరాచకాలు సృష్టిస్తున్నారని మండల బీజేపీ కార్యకర్తలు వాపోతున్నారు. అవినీతి అధికారిని ఎలా తీసుకొస్తారని ప్రశ్నించినందుకు ఎమ్మెల్యే, అతని అనుచరుడితోపాటు ఎస్సై బెదిరింపులకు పాల్పడడంతో శేఖర్‌రెడ్డి ప్రాణాలను పోగొట్టుకున్నాడన్నారు. శేఖర్‌రెడ్డి మృతికి కారకులైన ఎమ్మెల్యే, చెన్నయ్యసాగర్, ఎస్సై కుర్మయ్యలపై చట్టపరమైన చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేసే వరకు పోరాటం చేస్తామని బీజేపీ మండల నాయకులు హెచ్చరించారు.

**కేసు నమోదు వాస్తవమే: ఎస్సై కురుమయ్య**

'కాలేజీ కోసం స్థల పరిశీలన చేసే సమయంలో జరిగిన మాటల్లో ఎమ్మెల్యే శ్రీహరి, చెన్నయ్యసాగర్ మాకు శేఖర్‌రెడ్డిపై ఫిర్యాదు చేశారు. దీంతో కేసు నమోదు చేసి శేఖర్‌రెడ్డిని పోలీస్ స్టేషన్‌కు రావాలని ఫోన్ చేశాం. అయితే పోలీస్ స్టేషన్‌కు వస్తే ఏమైతుందో అని భయపడిన శేఖర్‌రెడ్డి పోలీస్ స్టేషన్‌కు రాకుండా పురుగుల మందు తాగాడు. జిల్లా దవాఖానకు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.'




సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

# పార్లమెంట్ ఫలితాలను సమీక్షిస్తాం..

- బీఆర్ఎస్‌ను బొందపెట్టడం ఏ పార్టీ వల్ల కాదు
- అభివృద్ధికి అడ్డుకుంటే సహించం
- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- ఆత్మ విమర్శ చేసుకుందాం : ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి
- పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలి : మాజీ ఎంపీ రావుల
- ఉత్సాహంతో పనిచేస్తాం : ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్
- వనపర్తిలో ఎన్నికల ఫలితాలపై నియోజకవర్గస్థాయి సమీక్ష



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

వనపర్తి, జూన్ 14 (నమస్తే తెలంగాణ) : 'పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలను గ్రామ, మండల స్థాయిలో పరిశీలిద్దాం.. తమిళనాడులో 55 ఏండ్లుగా కాంగ్రెస్, బీజేపీల ఊసే లేదు. ఏపీలో జగన్ పార్టీకి వచ్చిన ఓట్ల కంటే తెలంగాణలో తక్కువ ఓట్లొచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. అసెంబ్లీ ఎన్నికల్లో 42 శాతం ఓట్లతో 38 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకున్న బీఆర్ఎస్‌కు 60లక్షల సభ్యత్వమున్న గులాబీ సైన్యం ఉన్నది. ఇలాంటి పార్టీని ఎవరూ బొందపెట్టలేరు' అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్పష్టం చేశారు. ఉమ్మడి జిల్లాలో వనపర్తిలో తొలిసారిగా బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ అధ్యక్షతన శుక్రవారం నియోజకవర్గస్థాయి పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ మంత్రితోపాటు ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ఇక ఉండదని, బొందపెడతామని పదేపదే కాంగ్రెస్ చెబుతున్న మాటలు హాస్యాస్పదమన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ప్రజలకు భ్రమలు తొలగిపోతున్నాయని, రాష్ట్రంలో కాంగ్రెస్ ఏడునెలల్లో ఒక్క కొత్త హామీని కూడా అమలు చేయలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలనే కొనసాగిస్తూ, వాటిని కూడా సక్రమంగా అందించడం లేదని విమర్శించారు. కొత్త పథకాలు అమలు కావాలంటే రూ.లక్షా ఇరవై ఐదువేల కోట్లు కావాలని, అంతటి సామర్థ్యం కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదని ఎద్దేవా చేశారు. ఏపీలో అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడి ప్రభావం తెలంగాణపై పడుతుందన్నారు. తెలంగాణకు నీటిపారుదల రంగంలో తీవ్ర నష్ట ప్రణాళికలు చేసిన ఆదిత్యదాస్‌ను చంద్రబాబు సూచనతో సీఎం రేవంత్‌రెడ్డి ఇక్కడ భర్తీ చేశాడన్నారు. హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేసే కుట్రలు జరుగుతున్నాయని, తెలంగాణపై కొన్ని అదృశ్య శక్తుల ప్రభావం ఉంటుందన్నారు. ఇది రాష్ట్రానికి ఎంత మాత్రం శ్రేయస్కరం కాదన్నారు. భవిష్యత్‌లో తెలంగాణ సమాజం అప్రమత్తంగా ఉండాలని, లేనిపక్షంలో తీవ్ర నష్టాలను చవిచూడాల్సి ఉంటుందన్నారు. ఏపీలో పాలన ఎలా ఉన్నా తమకు అభ్యంతరం లేదని, తెలంగాణ అభివృద్ధికి అడ్డుపడే చర్యలపైనే తమ దృష్టి ఉంటుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల ఫలితాలపై బీఆర్ఎస్‌కు ఎలాంటి భయం లేదని, దేశంలోని 14 రాష్ట్రాల్లో కాం గ్రెస్‌కు, మరో 11 రాష్ట్రాల్లో బీజేపీకి ఒక్క ఎం పీ స్థానం కూడా రాలేదని నిరంజన్‌రెడ్డి గుర్తు చేశారు. గ్రామ, మండల స్థాయిలో సమీక్షలు, మేథోమదనం చేసుకుంటామని, మళ్లీ బీఆర్ఎస్సే రావాలని ప్రజలు అనుకునే స్థాయికి పరిస్థితులను తీసుకొస్తామని పేర్కొన్నారు.

**ఆత్మ విమర్శ చేసుకుందాం : ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి**

పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఫలితాలపై అధైర్యపడాల్సిన అవసరం లేదని, వాటిపై ఒకసారి ఆత్మ విమర్శ చేసుకుందామని ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణలో ప్రతిపక్షం బలంగా ఉన్నదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏడు నెలలుగా కొత్త పథకాలు అమలుచేయడం లేదన్నారు. కేవలం బీఆర్ఎస్ ఇచ్చిన పథకాలను కొనసాగిస్తూ సర్కారు గారడీ చేస్తున్నదని విమర్శించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఎలా తగ్గించాలనే ప్రయత్నాలు చేస్తున్నదని, ప్రజలు తిప్పికొడతారని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఎలాంటి సహకారమైనా అందించేందుకు సిద్ధంగా ఉంటానన్నారు. తనను గెలిపించిన వారికి, గెలుపు కోసం పనిచేసిన నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

**పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాలి : రావుల**

బీఆర్ఎస్ గడిచిన పదేళ్ల పాలనపైనే దృష్టి సారించి ఎన్నో అభివృద్ధి పనులను చేసిందని.. ప్రస్తుత పరిస్థితుల్లో పార్టీ నిర్మాణంపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై నిత్యం చర్చ జరపాలని, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోపు బీఆర్ఎస్ పార్టీ మరింత బలోపేతమయ్యేలా కార్యక్రమాలు చేపడతామమన్నారు. గ్రామస్థాయి నుంచి మండలస్థాయి వరకు ఎన్నికల ఫలితాలపై ప్రత్యేక వర్క్‌షాప్‌ను నిర్వహిస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లి నిరంతరం సమీక్షలు కొనసాగిస్తామన్నారు.

**ప్రజలు అబద్ధపు హామీలను నమ్మారు : ఆర్ఎస్‌పీ**

ఎన్నికల సమయంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలు ఇచ్చిన అబద్ధపు హామీలను ప్రజలు నమ్మి మోసపోయారని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఎక్కువ ఓట్లు వచ్చిన స్థానాల్లో నాగర్‌కర్నూల్ రెండోస్థానంలో నిలిచిందని, ఇందుకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తనకు ఓటమితో ఎలాంటి నిరుత్సాహం లేదని, కుంగడం.. పొంగడం తన జీవతంలోనే లేవని స్పష్టం చేశారు. తెలంగాణ సమాజాన్ని బతికించుకునేందుకు గతానికి మించి మరింత ఉత్సాహంగా పని చేస్తానని చెప్పారు. ఓటర్లు వారి చేత్తో వారి కండ్లనే పొడుచుకున్నారని పేర్కొన్నారు. అమరుల త్యాగాలు ముఖ్యమా? అక్షింతలు ముఖ్యమా? అని ఆలోచించి ఉంటే ఇలా జరిగి ఉండేది కాదన్నారు. తమిళనాడులో అక్షింతల చర్యకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. రాష్ట్రాన్ని కబ్జా చేసేందుకు అబద్ధపు ప్రచారాలు చేశారని, తెలంగాణ ప్రజలు కూడా త్వరలోనే మేల్కొంటారన్నారు. ప్రస్తుతం అదృశ్య హస్తం ఆధ్వర్యంలో తెలంగాణ పాలన సాగుతున్నదని ప్రవీణ్‌కుమార్ అన్నారు. భావి తరాల భవిష్యత్ కోసం నిరంతరం ప్రజల మధ్యలోనే ఉంటానని, ఎక్కడ సమస్య ఉంటే అక్కడే ప్రత్యక్షమవుతానని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఇంతియాజ్ ఇసాక్, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి బైకాని శ్రీనివాస్‌యాదవ్, నాయకులు అభిలాష్‌రావు, వాకిటి శ్రీధర్, బి.లక్ష్మ య్య, నందిమళ్ల అశోక్‌కుమార్, ఉంగ్లం తిరుమల్, నాగన్న యాదవ్, పలువురు ఎంపీపీలు, జెడ్పీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

# నిర్లక్ష్యం ఖరీదు నిండు ప్రాణం

- కట్టెలతో విచక్షణా రహితంగా దాయాదుల దాడి
- ఫోన్ చేసినా పట్టించుకోని ఎస్సై
- పాలమూరు దవాఖానలో చికిత్స పొందుతూ యువకుడి మృతి
- ఊట్కూర్ మండలం చిన్నపొర్లలో ఘటన
- అధికార పార్టీ అండదండలున్నట్లు బంధువుల ఆరోపణ



రోధిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు బంధువులు, ఇన్‌సెట్లో సంజీవ్ (ఫైల్)

ఊట్కూర్, జూన్ 14 : దాయాదుల మధ్య మొదలైన భూ తగాదాల్లో వ్యక్తి దారుణ హత్యకు గురైన ఘటన నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలం చిన్నపొర్లలో చోటుచేసుకున్నది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. దళిత కాలనీకి చెందిన గువ్వలి లక్ష్మప్పకు ఇద్దరు భార్యలు. మొదటి భార్య సంతానం ఎర్రగండ్ల సంజప్ప కాగా రెండో భార్య సంతానం పెద్ద సవారప్ప, చిన్న సవారప్ప. కాగా లక్ష్మప్ప తర పేరున ఉన్న తొమ్మిదెకరాల పొలాన్ని ముగ్గురు కుమారులకు రాసిచ్చాడు. కాగా మొదటి భార్య కొడుకైన సంజప్ప కొన్నేండ్ల కిందటే చనిపోగా అతడి కుమారులు భూ పంపకాలను వ్యతిరేకిస్తూ కోర్టును ఆశ్రయించారు. ఈక్రమంలో కొన్నాళ్లుగా పొలం కోసం ఘర్షణ పడుతున్నారు. ఇదే విషయమై పలుమార్లు పరస్పర దాడులతో పోలీస్‌స్టేషన్‌లో కేసులు కూడా పెట్టుకున్నారు. కాగా గురువారం పెద్ద సవారప్ప, అతని కుమారుడు సంజీవ్ (28), సోదరుడు చిన్న సవారప్ప, మరదలు కవిత తమ పేరిట ఉన్న పొలంలో విత్తనాలు వేసేందుకు వెళ్లారు. ఈక్రమంలో వారి దాయాదులైన ఆశప్ప, గుట్టప్ప, చిన్న వెంకటప్ప, ఆటో సంజీవ్, శ్రీను, కిష్టప్ప, నట్టలప్పతో పాటు మరి కొందరు రాళ్లు, కర్రలతో దాడులకు తెగబడ్డారు. ఈ దాడిలో తీవ్రంగా గాయపడిన సంజీవ్‌ను స్థానిక మాజీ సర్పంచ్ రవీందర్‌రెడ్డి, అతని అనుచరులు నారాయణపేట జిల్లా దవాఖానకు అటు నుంచి మహబూబ్‌నగర్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడిపై జరుగుతున్న దాడిని అతడి సోదరి సెల్‌ఫోన్ సహాయంతో వీడియో తీసింది. మృతుడికి భార్య అనిత, పిల్లలు సాత్విక్, వంశీ ఉన్నారు. సంజీవ్ మృతి తో తీవ్ర ఉద్రిక్తత నెలకొనగా మక్తల్ సీఐ చంద్రశేఖర్ గ్రామాన్ని సందర్శించి పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు.

## మృతదేహంతో ధర్నా

- ఎస్సైని సస్పెండ్ చేసిన పోలీసు ఉన్నతాధికారులు



ధర్నా చేస్తున్న కుటుంబ సభ్యులు

పోస్టుమార్టం అనంతరం సంజీవ్ మృతదేహాన్ని అంత్యక్రియల కోసం పోలీసులు శుక్రవారం సాయంత్రం అంబులెన్స్‌లో స్వగ్రామానికి తీసుకొచ్చారు. కాగా గ్రామస్తులు బాధిత కుటుంబానికి మద్దతుగా మృతదేహాన్ని అంబులెన్స్ నుంచి బయటకు దించకుండా ధర్నా నిర్వహించారు. డీసీఆర్బీ డీఎస్పీ మహేశ్ గ్రామానికి చేరుకుని సముదాయించే ప్రయత్నం చేసినా వారు ఒప్పుకోలేదు. ఘటనపై నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్సైని తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేస్తూ నాలుగు గంటల పాటు ధర్నా చేపట్టారు. ఈక్రమంలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఎస్సై శ్రీనివాసులును ఎస్పీ యోగేశ్ గౌతమ్ సస్పెండ్ చేస్తూ శుక్రవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. ఎట్టకేలకు ఎస్సైపై సస్పెన్షన్ వేటు పడడంతో గ్రామస్తులు ధర్నాను విరమించారు.

**ఎస్సై నిర్లక్ష్యంతోనే దారుణం..**

చిన్నపొర్లలో దాయాదుల మధ్య జరిగిన ఘర్షణపై బాధిత కుటుంబం, స్థానికులు 100కు సమాచారమిచ్చినా ఎస్సై శ్రీనివాసులు స్పందించలేదని.. ఫలితంగా సంజీవ్ మృతి చెందాడని ఆరోపిస్తున్నారు. ఘటన మధ్యాహ్నం 1:30గంటలకు జరిగితే పోలీసులు రెండు గంటలు ఆలస్యంగా రావడంతో అప్పటికే ఘోరం జరిగిందన్నారు. ఘటన విషయాన్ని చెప్పేందుకు వెళ్లగా ఆ సమయంలో ఠానాలోనే ఉన్న ఎస్సై శ్రీనివాసులు తనపై పరుష పదజాలంతో చిందులు వేసినట్లు పెద్దజట్రం గ్రామానికి చెందిన ఓ దళిత ప్రజాప్రతినిధి తెలిపారు.

**అధికార పార్టీ అండదండలతోనే..**

దాయాదుల దాడిలో గాయపడి మృతి చెందిన సంజీవ్ బీజేపీలో క్రియాశీలకంగా ఉంటూ పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. పొలంలో విత్తనాలు నాటాలని.. దాయాదుల నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ కుటుంబసభ్యులతో కలిసి పదిరోజుల కిందటే పోలీసులను ఆశ్రయించాడు. ఇదే విషయమై రెండ్రోజుల కింద మక్తల్ సీఐని సంప్రదించామన్నారు. సీఐ ఆదేశాలతో ట్రాక్టర్‌తో పొలానికి వెళ్లిన తమ కుమారుడిని అకారణంగా పొట్టన పెట్టుకున్నట్లు సంజీవ్ తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. నిందితులు కాంగ్రెస్ పార్టీకి చెందిన వారు కావడంతోనే ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించులేదన్నారు.

**ఏడుగురిపై కేసు నమోదు..**

ఘటనపై ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు ఓ వర్గానికి చెందిన ఆటో సంజప్ప, చిన్న వెంకటప్ప, గుట్టప్ప, ఆశప్ప, శ్రీను, కిష్టప్ప, నట్టలప్పపై కేసు నమోదు చేశామని, నలుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు. డయల్ 100కు సమాచారమివ్వగానే పోలీసులను పంపించి గాయపడిన వ్యక్తిని అంబులెన్స్‌లో దవాఖానకు తరలించినట్లు ఎస్సై వెల్లడించారు.

# అయిజ ఎస్సైపై చర్యలు తీసుకోవాలి

- గద్వాల బార్ అసోసియేషన్ సభ్యుల డిమాండ్

గద్వాల అర్బన్, జూన్ 14 : సివిల్ వివాదంలో తలదూర్చడంతోపాటు ప్రశ్నించిన న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తిస్తూ బెదిరింపులకు పాల్పడిన అయిజ ఎస్సై విజయ్‌భాస్కర్‌పై చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ సభ్యులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని జిల్లా న్యాయవాదులు విధులను బహిష్కరించి కోర్టు అవరణలో శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జడ్జీలు కె.కుషా, గంట కవితాదేవి, ఉదయ్‌నాయక్‌లతోపాటు డీఎస్పీ సత్యనారాయణకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రఘురాంరెడ్డి మాట్లాడుతూ అయిజ పోలీస్‌స్టేషన్‌తోపాటు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్‌ల్లో ఎస్సైలు సివిల్ తగాదాల్లో తలదూర్చుతున్నారని ఆరోపించారు. పోలీసులను సివిల్ విషయంలో తలదూర్చకూడదని అత్యున్నత, ఉన్నత న్యాయస్థానాలతోపాటు ఉన్నతాధికారులు ఎన్నిసార్లు చెప్పినా కిందిస్థాయిలో ఈ ఉత్తర్వులు అమలు కావడం లేదన్నారు. పైగా ప్రశ్నించిన పౌరులను భయాందోళనలకు గుర్తి చేస్తున్నారని వివరించారు. న్యాయవాదిపై దురుసుగా ప్రవర్తించిన ఎస్సై పై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో న్యాయవాదులు ఖాజామైనుద్దీన్, ప్రభాకర్, శ్రీధర్, షఫీ ఉన్నారు.

## జూరాలకు 6,558 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో..

- ప్రాజెక్టు నుంచి అవుట్‌ఫ్లో 1,280 క్యూసెక్కులుగా నమోదు

గద్వాల, జూన్14: జూరాల ప్రాజెక్టుకు వరద నిలకడగా కొనసాగుతున్నది. శుక్రవారం 6,558 క్యూసెక్కుల వరద చేరినట్లు అధికారులు తెలిపారు. జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 3.517 టీఎంసీలు ఉన్నది. అయితే ప్రాజెక్టు నుంచి నెట్టెంపాడ్ లిఫ్టుకు 354 క్యూసెక్కులు, భీమా లిఫ్ట్–1కు 568 క్యూసెక్కులు, కోయిల్‌సాగర్ లిఫ్టుకు 230 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. మొత్తం అవుట్‌ఫ్లో 1,280 క్యూసెక్కులుగా నమోదైనట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.